సాక్షి రంగారెడ్డి

గురువారం । 27 । జూన్ । 2024



తండ్రి మందలించాడని..

అందరి ముందు తండ్రి మందలించాడన్న మనస్తాపంతో కొడుకు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 8లో▸



విస్తరణకు సహకరించండి

రోడ్డుతో రవాణా సౌకర్యానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, విస్తరణకు సహకరించాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. 8లో▸



'జోగినపల్లి' కృషి ఎనలేనిది

విద్యాభివృద్ధికి జోగినపల్లి భాస్కర్‌రావు చేసిన సేవలు మరువలేనివని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. 8లో▸

విలువ పెంచేలా..



భూముల మార్కెట్ ధరల సవరింపునకు కసరత్తు పూర్తి

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన జిల్లా యంత్రాంగం
- 20నుంచి 40శాతం పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు
- ఆగస్టు 1నుంచి అమలులోకి

రాష్ట్ర ఖజానాకు ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న ప్రభుత్వం వ్యవసాయ, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువను సవరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన రహదారుల పక్కన ఉన్న, మున్సిపాలిటీల్లోని స్థలాల రిజిస్ట్రేషన్ ధరల విలువ గరిష్టంగా 40శాతం వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు ఆ శాఖ నుంచి సర్కారుకు ప్రతిపాదనలు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు ఈనెల 18న క్షేత్రస్థాయిలో పర్యటించారు. సర్కారు నిర్ణయించిన మార్కెట్ విలువకు, బహిరంగ మార్కెట్‌లోని ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసంపై అధ్యయనం చేసి, మార్కెట్ విలువ సవరణపై ప్రాథమిక అంచనాలు రూపొందించారు. 2021 నాటి సవరణ అనంతరం అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్, మార్కెట్ విలువలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన సవరణ ప్రతిపాదనలు మొదటి దశలో సబ్ రిజిస్ట్రార్ల నుంచి జిల్లా రిజిస్ట్రార్లకు, అనంతరం డీఐజీ(డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్) కార్యాలయాలకు చేరాయి. జూన్ 29న కమిటీ ఆమోదం తెలపనుంది. సవరించిన ధరలను జులై ఒకటి నుంచి 15 వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఇదే రోజు నుంచి అభ్యంతరాలను స్వీకరించి 20న పరిశీలిస్తారు. 24న రివిజన్ కమిటీ మార్కెట్ విలువకు ఆమోద ముద్ర వేయనుంది. కొత్త ధరలను 31న కంప్యూటర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆగస్టు ఒకటి నుంచి మార్కెట్ నూతన విలువ అమల్లోకి రానుంది.

- మణికొండలో ప్రభుత్వ మార్కెట్ విలువ గజానికి రూ.18 వేలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.1.50 లక్షలకుపైగా పలుకుతోంది.
- కోకాపేట్, నార్సింగిలో ప్రభుత్వ మార్కెట్ విలువ గజానికి రూ.12 వేలు ఉండగా, మార్కెట్‌లో రూ.1.50 లక్షల పైమాటే.
- శేరిలింగంపల్లిలో గజం రూ.32,500 ఉండగా, మార్కెట్లో రూ.2.50 లక్షలు పలుకుతోంది.
- హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, చిలుకూరులో ఎకరం మార్కెట్ వాల్యూ రూ.52.50 లక్షలు ఉండగా, బయటి మార్కెట్లో రూ.6 కోట్ల నుంచి 10 కోట్లు నడుస్తోంది.
- శంషాబాద్‌లో ప్రభుత్వ మార్కెట్ విలువ ఎకరానికి రూ.1,22,500 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్లపై మాటే.
- యాచారం పట్టణంలో ప్రస్తుతం ప్రభుత్వ మార్కెట్ వాల్యూ ఎకరానికి రూ.24 లక్షలు ఉండగా, శివారు ప్రాంతాల్లో రూ.10.50 లక్షలు ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువతో పోలిస్తే.. బహిరంగ మార్కెట్‌లో భూముల విలువల మధ్య భారీ వ్యత్యాసం ఉంది.
- వీటిని సవరించడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చవచ్చని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ శాఖలు నిర్ణయించాయి. ఈ మేరకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల కేంద్రాలు, ఐటీ అనుబంధ పారిశ్రామిక వాడల వారీగా భూముల లెక్కలను తీసే పనిలో నిమగ్నమయ్యాయి.

ఆయా ప్రాంతాలను బట్టి భూ మార్కెట్ విలువ 20 నుంచి 40 శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పెరగనున్న రిజిస్ట్రేషన్ ఖర్చు

యాచారం మండల కేంద్రంలో ప్రస్తుతం ఎకరం భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.75 వేలు ఖర్చు అవుతుండగా.. మార్కెట్ విలువ సవరణ అనంతరం రూ.లక్ష దాటే అవకాశం ఉంది. శేరిలింగంపల్లి, మణికొండ, నార్సింగి, కోకాపేట్, రాజేంద్రనగర్, బుద్వేల్, శంషాబాద్, వంటి ఐటీ కారిడార్లలోని నివాస భవనాల్లో చదరపు అడుగు విస్తీర్ణం ధర రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెరగొచ్చు. ఇక వాణిజ్య భవనాల విషయంలోనూ ఇదే అమలయ్యే చాన్స్ ఉంది. దీంతో ఖజానాకు భారీగా ఆదాయం సమకూరనుంది.

కొనుగోలుదారులపై భారం

మార్కెట్ విలువలను సవరించడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరడంతో పాటు కొనుగోలు దారులపై రిజిస్ట్రేషన్ చార్జీల భారం మరింత పడనుంది. జిల్లాలో కొత్తగా ఏర్పడిన శంకర్‌పల్లి, కొత్తూరు, ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయాంజాల్, తుక్కుగూడ, ఆమనగల్లు, శంషాబాద్, షాద్‌నగర్ మున్సిపాలిటీలతో పాటు బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్లలో భూముల విలువలు భారీగా పెరిగే అవకాశం ఉంది. జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రామాల్లోనూ భూముల మార్కెట్ విలువ పెరుగుతుంది. కేవలం గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మణికొండ వంటి ఐటీ జోన్లలోనే కాదు యాచారం ఫార్మాసిటీ, శంషాబాద్, మహేశ్వరం, రావిర్యాల, చందనవెల్లి, కొత్తూరు, ఆదిబట్ల పారిశ్రామికవాడల్లోనూ భూముల విలువను బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా సవరించనున్నారు. భూములను వ్యవసాయ, వ్యవసాయేతర కేటగిరీలుగా విభజించి, చార్జీలు నిర్ణయించనున్నారు.

ధరణిలో భూమిని తొలగించారంటూ

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

శంషాబాద్: ధరణిలో తన భూమికి సంబంధించిన వివరాలు తొలగించారంటూ శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శంకరాపురం గ్రామానికి చెందిన చెన్న కమలేష్ కమలమ్మ, లక్ష్మయ్య దంపతులకు ఘాన్సిమియా గూడలోని సర్వేనంబరు 4/7 4/8లో ఉన్న భూమి వివరాలను గత ఏడాది ధరణిలో తొలగించారని బాధితులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సుమారు వందసార్లకుపైగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ధరణిలో తిరిగి వివరాలు నమోదు చేయడం లేదంటూ కమలమ్మ, లక్ష్మయ్య దంపతుల కుమారుడు సూరిబాబు ఈ సీసాలో తెచ్చుకున్న పెట్రోలు ఒంటిపై పోసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అప్పటికే అక్కడికి చేరుకున్నారు. పెట్రోలు పోసుకున్న వెంటనే సూరిబాబును అదుపులోకి తీసుకుని నీళ్లు పోయించారు. సూరిబాబు కుటుంబ సభ్యులు అక్కడే కాసేపు బైఠాయించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే తమ భూమి వివరాలు తొలగించి దానిని వేరే వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు పరిశీలనలో ఉందని అధికారులు వెల్లడించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సూరిబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ఒంటిపై పెట్రోలు పోసుకుంటున్న సూరిబాబు

నీట్ పరీక్షను రద్దు చేయాల్సిందే

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కాచిగూడ: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష స్కామ్‌పై ప్రధాని స్పందించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం నారాయణగూడ చౌరస్తాలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర నేత కృష్ణ తదితరులతో కలిసి బల్మూరి వెంకట్ మాట్లాడారు. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా దానిని రద్దు చేయకుండా ప్రధాని మౌనం వహించడం తగదన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మాట్లాడకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద మహా దీక్ష చేపడతామని హెచ్చరించారు. చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో హస్మిబాబు, ఎం.డి. జావిద్, లెనిన్, సాయికృష్ణ, అనిల్, స్టాలిన్, శ్రీమాన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాలు

న్యూస్‌రీల్

రైతులకు అండగా సహకార సంఘాలు



సమావేశమైన డీసీసీబీ చైర్మన్, డైరెక్టర్లు

తుర్కయంజాల్: సహకార సంఘాలు రైతులకు అండగా పనిచేస్తున్నాయని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ది హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభను బుధవారం తుర్కయంజాల్‌లోని తులిప్స్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అన్నారు. రూ.2 లక్షల పంట రుణాలను ఒకే విడతలో మాఫీ చేయాలని నిర్ణయించడం హర్షించదగిన విషయమని తెలిపారు. అనంతరం జిల్లాలోని సహకార సంఘాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కార మార్గాలు, రైతుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు ఎస్.రవీందర్‌గౌడ్, అంజిరెడ్డి, చంద్రశేఖర్, సతీష్, ప్రవీణ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పి.రామ్‌రెడ్డి, పి.లక్ష్మారెడ్డి, కె.శ్యామ్ సుందర్‌రెడ్డి, జి.సైదా, పి.జి.వి.రాణి, గిరిధర్‌తో పాటు పలు సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కేశంపేట: మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జీడిమెట్ల కేంద్రీయ కార్యాలయ అసిస్టెంట్ ప్లాంట్ ప్రొడక్షన్ అధికారులు శ్వేత, పద్మ సూచించారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, అల్వాలలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు లీటరు నీటిలో 5ఎంఎల్ నీమ్ ఆయిల్ కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. వీరి వెంట ఏఈఓలు లలిత, సుస్మిత, సుధ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం



సాక్షి, సిటీబ్యూరో: మహానగరానికి నీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్–2లోని కోదండాపూర్ పంప్ హౌజ్‌లో రెండో పంపుఎన్ఆర్‌వీ వాల్వ్ మరమ్మతు పనుల కోసం గురువారం పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి వర్గాలు పేర్కొన్నాయి. కొన్నిచోట్ల పూర్తిగా.. మరికొన్ని చోట్ల పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని, ఇంకొన్ని ప్రాంతాల్లో ప్రెజర్‌తో నీరు సరఫరా అవుతుందని పేర్కొంది. మీరాలం, బాలాపూర్, మైసారం, బార్కాస్ భోజగుట్ట, ఆళ్లబండ, మేకలమండీ, భోలక్ పూర్, చిలకలగూడ, తార్నాక, లాలాపేట్, బౌద్ధ నగర్, మారేడ్ పల్లి, కంట్రోల్ రూమ్, రైల్వేస్, కంటోన్మెంట్, ప్రకాశ్ నగర్, పాటిగడ్డ, హస్మత్ పేట్, ఫిరోజ్ గూడ, గౌతమ్ నగర్, వైశాలి నగర్, బీఎస్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్కపురి కాలనీ, మహీంద్రహిల్స్, ఏలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిల్కా నగర్, బీరప్పగడ్డ, బుద్వేల్, శాస్త్రిపురం, మీర్ పేట్, బడంగ్ పేట్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి తెలిపింది.



క్లినిక్‌ని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, సిబ్బంది

నిబంధనలు అతిక్రమిస్తే కేసులే

- డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు
- శంకర్‌పల్లిలో పలు ఆస్పత్రుల సీజ్

శంకర్‌పల్లి: ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆస్పత్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సూచన మేరకు జిల్లాలోని ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా శంకర్‌పల్లిలోని పలు ఆస్పత్రులు, క్లినిక్స్‌ని పరిశీలించారు. నిబంధనలు పాటించని సంపత్, బాలాజీ, దివ్య, వెంకటేశ్వర, శ్రీనివాస సేవానికేతన్ క్లినిక్‌లు అలాగే తోటవారి కట్లు, బాలాజీ బోన్ సెటింగ్ సెంటర్‌లను సీజ్ చేశారు. మరో ముగ్గురు వైద్యులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. వారు పూర్తిస్థాయి డాక్టర్లుగా చెప్పుకోవద్దని హెచ్చరించారు. జిల్లాలో తనిఖీలు రోజు జరుగుతాయని, శంకర్‌పల్లిలో మళ్లీ 15 రోజుల్లో దాడులు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, డీఈఎంఓ శ్రీనివాస్, పీహెచ్‌సీల వైద్యాధికారులు రేవతి రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేట్లు పెంచుకుంటే తప్పేంటి..?

ప్రైవేటు ఆస్పత్రుల్లో రాత్రిపూట వైద్యానికి రేట్లు పెంచుకుంటే తప్పేంలేదని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. ఏ ఆస్పత్రిలో అయినా పగలు, రాత్రి ఒకే రేట్లు ఉండాలన్న నిబంధనేమి ఆయన లేదన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు నచ్చిన విధంగా రేట్లు పెంచుకోవచ్చన్నారు. రేట్లను అదుపులో ఉంచాల్సిన అధికారులే ఇలా అనడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కొత్త బాసులొచ్చారు..

ఆమ్రపాలి, రంగనాథ్ బాధ్యతల స్వీకరణ





సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్ (ఎఫ్ఏసీ)గా ఆమ్రపాలి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా ఉన్న రోనాల్డ్‌రాస్ నుంచి ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు ఆమ్రపాలికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. బుద్ధభవన్ కార్యాలయంలో ఈవీడీఎం కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ బాధ్యతలు స్వీకరించారు.

జలమండలి ఎండీ సైతం..

అలాగే.. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.అశోక్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన సుదర్శన్ రెడ్డి నుంచి చార్జ్ తీసుకున్నారు. నూతన ఎండీకి జలమండలి అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.



ఉద్యాన పంటలకు ప్రోత్సాహం కరువు!

- జాడలేని విత్తనాలు, డ్రిప్ పరికరాలు
- నారు కోసం ప్రైవేట్ నర్సరీలను ఆశ్రయిస్తున్న రైతులు



యాచారంలోని ఓ ప్రైవేట్ నర్సరీలో పెంచుతున్న టమాటా నారు

యాచారం: రైతు సంక్షేమానికి ఎన్నో చేస్తున్నామని ప్రభుత్వాలు ఊదరగొడుతున్నా.. క్షేత్రస్థాయి పరిస్థితులు ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. హార్టికల్చర్, సెరీకల్చర్ శాఖలతో తమకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరడం లేదని పుడమి పుత్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఆయిల్‌పాం సాగుపై దృష్టిసారించిన ఉద్యాన శాఖ.. కూరగాయలు, పండ్ల తోటల సాగుకు.. ప్రోత్సాహంపై శీతకన్ను వేసిందని చెబుతున్నారు. జిల్లాలో అత్యధికంగా కూరగాయలు సాగయ్యే ప్రాంతంగా ఇబ్రహీంపట్నం డివిజన్‌కు పేరుంది. నగరానికి దగ్గరగా ఉండడంతో ఇక్కడి రైతులు తమ పొలాల్లో కూరగాయలు, ఆకు కూరలు విరివిగా సాగు చేస్తున్నారు. మాదన్నపేట, సరూర్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్ మార్కెట్లకు తరలించి విక్రయిస్తారు.



నారు పంపిణీలో స్పష్టత కరువు

ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా విత్తనాలు, నారు పంపిణీ విషయంలో ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖల నుంచి స్పష్టమైన సమాచారం లేదు. డివిజన్‌లో ఎనిమిది వేల ఎకరాల్లో 3 వేల మందికి పైగా రైతులు టమాటా, చిక్కుడు, బీరా, వంకాయ, బెండ, సోరకాయ, దొండ తదితర కూరగాయలను పండిస్తారు. 7 వేల ఎకరాలకు పైగా మామిడి, జామ, దానిమ్మ తదితర పండ్ల తోటలను సాగు చేస్తారు. అయినా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ నుంచి సరైన ప్రోత్సాహం లేదు. ప్రస్తుతం నార్లు పోసుకునే సమయం. కానీ అధికారుల నుంచి నార్లు, విత్తనాల అందజేతలో ఎలాంటి స్పష్టత రైతులకు ఇవ్వలేదు.

విత్తన కొనుగోలుకు రూ.2 కోట్లు

ఉద్యాన శాఖ నుంచి విత్తనాల జాడ లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు వేలాది రూపాయలు చెల్లించి కూరగాయల విత్తనాలను కొనుగోలు చేశారు. ఇలా డివిజన్‌లోని పలు గ్రామాల్లోని రైతులు కేవలం విత్తనాల కొనుగోళ్లకే దాదాపు రూ.రెండు కోట్ల మేర ఖర్చు చేశారు. ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో అనుమతులు లేకుండానే నర్సరీలో నార్ల పెంపకం చేపడుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో నాణ్యత విషయంలో స్పష్టత లేకపోయినా రైతులు కొనుగోలు చేసి నాటుతున్నారు. డివిజన్‌లో రెండు వేల ఎకరాలకు పైగా డ్రిప్ పరికరాల కోసం కర్షకులు అర్జీలు పెట్టుకున్నారు.

పెట్టుబడులకు అప్పులు చేశా



ఎకరా పొలంలో ఆలుగడ్డ సాగు చేశా. ఇప్పటికే రూ.50 వేల ఖర్చు చేశా. ఏ కూరగాయల పంటలు సాగు చేసిన ఉద్యానశాఖ నుంచి ప్రోత్సాహం లేదు. విత్తనాలు, డ్రిప్ పరికరాలు లేవు. అప్పులు చేసి కూరగాయలు పండించి మార్కెట్లకు తరలిస్తున్నాం.

– కాశమల్ల రాములు, రైతు, చౌదర్‌పల్లి

కూరగాయల సాగే ఆధారం



మా గ్రామంలో 60 శాతం మంది రైతులు కూరగాయల సాగుపైనే ఆధారపడ్డారు. నిత్యం మాదన్నపేట, సరూర్‌నగర్, వనస్థలిపురం తదితర మార్కెట్లకు తరలిస్తారు. వానాకాలం కింద కూరగాయల సాగుకు మా గ్రామ రైతులు రూ.15 లక్షలు ఖర్చు చేశారు.

– అచ్చెన జంగయ్య, మాజీ సర్పంచ్, గడ్డమల్లయ్యగూడ

రాయితీపై విత్తనాలు లేవు



ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ నుంచి రాయితీపై కూరగాయల పంటల నార్లు, విత్తనాలు లేవు. త్వరలో డ్రిప్ పరికరాలు రావచ్చు. కానీ సర్కార్ నుంచి ఏ విధమైన రాయితీలు లేవు. డివిజన్‌లో దాదాపు 10 వేల ఎకరాల్లో పలు రకాల కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేస్తారు.

– కనకలక్ష్మి, ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి, ఇబ్రహీంపట్నం

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

తెలంగాణ ఉద్యమకారులు

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అన్నీ కోల్పోయి రోడ్డున పడిన వారంతా ఏకమై.. సమస్యల పరిష్కారానికి పోరాడుదామని ఉద్యమకారులు పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వైఎన్నార్ గార్డెన్‌లో బుధవారం ఉద్యమకారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారమే ఎజెండాగా వేదికను ఏర్పాటు చేసుకుని.. ఉద్యమకారులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే కార్యాచరణను రూపొందించుకోనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉద్యమకారులు ధనుంజయ్య గౌడ్, వెంకటేశం గౌడ్, జంగం గౌడ్, సుధాకర్, కృష్ణ, దేవేందర్, జంగయ్య, రవీందర్, చిర్రె కృష్ణ, అలుగొపెల్లి కృష్ణ, ఏసూరి జంగయ్య, గుండ్ల జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రాహదారిపై లారీ బోల్తా



ఘటనా స్థలంలో లారీ

ఇబ్రహీంపట్నం: కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ కూడా క్షేమంగానే ఉన్నాడు. ఘటనా స్థలం సాగర్ హైవే కావడంతో ట్రాఫిక్‌కు సుమారు గంటపాటు అంతరాయం కలిగింది. పోలీసులు లారీని పక్కకు తొలగించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

తండ్రి మందలించాడని..

- తనయుడు ఆత్మహత్యాయత్నం
- వాట్సప్‌లో వీడియో చక్కర్లు.. కాపాడిన పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆనంద్



నీళ్ల సీసాలో పురుగు మందు కలుపుకొని.. తాగుతున్న యువకుడు

చేవెళ్ల: అందరి ముందు తండ్రి మందలించాడన్న మనస్తాపంతో కొడుకు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గిరిగెట్ పల్లి గ్రామానికి చెందిన విఠలయ్య కుమారుడు ఆనంద్(21) చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ.. మల్కాపూర్ గ్రామంలోని అక్క శశికళ ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో తండ్రి విఠలయ్య.. కొడుకు ఆనంద్ కోసం నాలుగు రోజులుగా ఫోను చేస్తున్నా తీయకపోవడంతో విషయం తెలుసుకునేందుకు మంగళవారం చేవెళ్లకు వచ్చాడు. పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి చూడగా.. అక్కడే ఉన్న ఆనంద్‌ను చూసి కోపంతో అందరి ముందు మందలించాడు.

వీడియో ఆధారంగా..

తండ్రి కోపగించడాన్ని అవమానంగా భావించిన తనయుడు పురుగు మందు(టప్పర్ 77)ను తాగుతున్న వీడియోలను వాట్సప్ స్టేటస్‌లో పోస్టు చేశాడు. ఈ దృశ్యాలను గమనించిన ఆనంద్ బావ జంగయ్య వెంటనే భార్య శశికళతో చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీడియో ఆధారంగా ఆనంద్ ఉన్న లోకేషన్ కొనగట్టు శివాలయం ప్రాంతంలో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడే ఉన్న యువకుడిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మహేందర్‌రెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. తాగిన మందును పూర్తిగా బయటకు తీయడంతో ప్రమాదం తప్పిందని వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించటమే కాకుండా.. ఘటనా స్థలికి వెళ్లి యువకుడి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ నరేశ్, హోంగార్డు రమేశ్‌ను అధికారులు, స్థానికులు అభినందించారు. వాట్సప్ వేదికగా.. శభాష్ పోలీస్ అంటూ ప్రశంసించారు.



విద్యార్థి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కళాశాలపై చర్యలు తీసుకోండి

- ఆ కాలేజీకి పర్మిషన్ లేదు
- అడ్మిషన్లు తీసుకోవొద్దని నినాదాలు
- విద్యార్థి నాయకుల అరెస్టు, విడుదల

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమతి లేని ప్రైవేట్ కళాశాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్ డిమాండ్ చేశారు. పర్మిషన్లు లేని కారణంగా అడ్మిషన్లు తీసుకోవద్దని నినదించారు. ఈ మేరకు బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ సమీపంలోని కళాశాల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. భవనానికి కూడా అనుమతులు లేవని, ఇదే విషయమై గతంలో ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేశామని, డీఐఈఓకు చెప్పినా పట్టించుకోలేని ఆరోపించారు. కళాశాల యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కయ్యారని విమర్శించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఎస్ఎఫ్ఐ నాయకులను ఆదిబట్ల ఠాణాకు తరలించారు. అనంతరం నాయకులను వదిలి పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, నాయకులు కిషన్, నర్సింహ, ప్రకాష్ కారత్‌లు కోరగా.. సొంత పూచికత్తుతో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, ఉపాధ్యక్షుడు ఏర్పుల తరంగ్, మస్కు చరణ్, శివ, శ్రీకాంత్, మధు, లక్ష్మణ్, సాయి, చరణ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సహకరించండి

- ఇరువైపులా సీసీరోడ్డు.. మధ్యలో లైటింగ్
- ఎవరికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా డిజైన్
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రోడ్డు విస్తరణ గురించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: పట్టణంలో ప్రస్తుతం ఉన్న రోడ్డుతో రవాణా సౌకర్యానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రహదారి విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. బుధవారం ఆర్‌అండ్ అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తూరు పట్టణ సమీపంలోని వై జంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెన వరకు పాత జాతీయ రహదారిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కూడలి నుంచి రైల్వే వంతెన వరకు రూ.5 కోట్లతో ఇరు వైపులా సీసీరోడ్లు, మధ్యలో లైటింగ్, డివైడర్లతో కూడిన రహదారి పనులు చేపట్టడానికి డిజైన్ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రోడ్డును ఎక్కువ ఎత్తులో నిర్మిస్తే తమ భవనాల్లోకి వర్షపు నీరు చేరుతుందని వ్యాపారులు ఎమ్మెల్యే విన్నవించగా.. ఎవరికి ఎలాంటి నష్టం జరగకుండా ఆకృతి రూపొందించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి నిధులు రాని కారణంగా భవనానికి కాంట్రాక్టర్ తాళం వేసుకున్నట్లు లైబ్రేరియన్ శ్రీనివాస్‌రాజు ఎమ్మెల్యేకు వివరించగా.. సమస్య పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జే.సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, కర్రొళ్ల సురేందర్, గోవర్ధన్ గౌడ్, గోపాల్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, నర్సింహ్మా, శివశంకర్‌గౌడ్, జగన్, శ్రీకాంత్, ఆంజనేయులు, సత్తయ్య, మహేశ్‌గౌడ్, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు

- నాలుగు తులాల బంగారం స్వాధీనం

కేశంపేట: వారం రోజుల క్రితం మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు పుస్తెల తాడును దొంగిలించిన విషయం విధితమే. ఈ కేసులో పోలీసులు నిందితులను పట్టుకుని, వారి నుంచి పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి లేమామిడి గ్రామ శివారు మేల్లకుంటలో వ్యవసాయ భూమిలో ఏర్వ జయమ్మ పశువులను మేపుతుండగా.. ఆమె మెడలోంచి బైక్‌పై ఓ మహిళలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి పుస్తెల తాడును తెంపుకుపోయాడు. ఈ సంఘటన ఈ నెల 19న చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ లింగం విచారణ ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మైలార్‌దేవ్‌పల్లికి చెందిన సోమ నరేష్ అతడి భార్య బైండ్ల బిందులు నిందితులుగా గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గతంలో మైలార్‌దేవ్‌పల్లి ఠాణా పరిధిలో అద్దెకు ఉంటున్న ఇంటి పరిధిలో బంగారు గాజులు దొంగతనం చేసి, జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. చైన్ స్నాచింగ్ కేసును వారం రోజుల్లో చేధించిన ఎస్ఐ లింగం, సిబ్బందిని మండల ప్రజలు అభినందించారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

ఇబ్రహీంపట్నం: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కొండ మల్లేపల్లి నుంచి కొంగరకలాన్‌కు ఎలాంటి అనుమతి లేకుండా నాలుగు టిప్పర్లలో మట్టిని తరలిస్తుండగా.. వాటిని పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఈ మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. అక్రమంగా మట్టిని తరలిస్తే.. వాహనం సీజ్ చేయడంతో పాటు.. సంబంధిత వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అక్రమంగా మట్టి వ్యాపారం



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కేశంపేట: మండల పరిధి కొత్తపేట గ్రామ శివారులోని కోన చెరువు నుంచి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలిసిన పోలీసులు చెరువు వద్దకు వెళ్లగా.. అప్పటికే మట్టి మాఫియా ట్రాక్లర్లు, జేసీబీతో సహా పరారైనట్టు గ్రామస్తులు తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

తలకొండపల్లి: పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధి యడవల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. యడవల్లికి చెందిన కమలమ్మ(57) స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తుంది. మంగళవారం పశువుల మేతకోసం వ్యవసాయ పొలంలో చొప్ప గడ్డి కత్తరిస్తుంది. ఈ క్రమంలో కమలమ్మను పాము కాటువేసింది. చికిత్స కోసం ఆమనగల్లు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఆమె చనిపోయింది.

నిందితులను అరెస్టు చేయాలి



బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు అందజేస్తున్న శంకర్, కల్పన

షాబాద్: దొంగతనం నెపంతో దళిత బాలుడిపై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలోని డీబీఎఫ్ జాతీయ ఎస్సీ కమిషన్, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్, బాలల హక్కుల కమిషన్‌లలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. షాబాద్ మండలం కేసారం గ్రామానికి చెందిన దళిత మైనర్ యాదగిరిపై దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. అదే గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి ఇంటి ఎదుట ఉన్న దానిమ్మ చెట్టుకు పండ్లు తెంపుకోవడాన్ని జీర్ణించుకోలేక బాలున్ని కట్టేసి హింసించారని ఆరోపించారు. బాలుడిని కొట్టిన వ్యకిని అరెస్టు చేసి శిక్షించాలని కోరారు.

పంటలను కాపాడుకోండి

జిల్లా వ్యవసాయ అధికారి గీతా



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి గీతా

కొందుర్గు: ప్రస్తుతం వర్షాలు అనుకూలంగా లేకపోవడం వలన మొలక దశలోనే పంటలు ఎండిపోతున్నాయని, వర్షాభావ పరిస్థితుల నుంచి పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతా సూచించారు. బుధవారం ఆమె కొందుర్గు మండం టేకులపల్లి గ్రామాన్ని సందర్శించి పత్తి, మొక్కజొన్న, జనుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. పంటలు మొలక దశలో ఎండిపోకుండా ఉండేందుకు నీటిని పిచికారీ చేయాలని, అదే విధంగా లీటరు నీటికి రెండు గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ముఖ్యంగా పత్తి పంటలో మొలక లేని చోట విత్తనాలు నాటుకోవాలని చెప్పా రు. మొక్కజొన్నలో కత్తెర పురుగు రాకుండా నియంత్రించేదుకు పంట మధ్యలో ఎకరానికి ఆరు పంగళ కర్రలను పాతాలని పేర్కొన్నారు. వీలైనంత వరకు పంట మార్పిడి పాటించాలన్నారు. వరిలో పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుములు చల్లి ఏపుగా పెరిగిన అనంతరం కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ..

నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో కార్లు

మొయినాబాద్: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈసంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మండల పరిధి చిన్నషాపూర్ చౌరస్తా సమీపంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా నర్సాపూర్‌కు చెందిన అరవింద్‌రెడ్డి, వినయ్ తన స్విఫ్ట్ కారులో బుధవారం సాయంత్రం చేవెళ్ల వైపు వెళ్తున్నారు. జాతీయ రహదారి మొయినాబాద్ మండలం చిన్నషాపూర్ చౌరస్తా సమీపంలోకి రాగానే.. వికారాబాద్‌కు చెందిన అర్షద్, ముషారఫ్ తమ స్విఫ్ట్ డిజైర్ కారులో వేగంగా వస్తూ.. మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వచ్చి స్విఫ్ట్ కారును ఢీకొట్టారు. ఈ సంఘటనలో కార్లలో ఉన్న నలుగురు అర్షద్, ముషారఫ్‌కు కాళ్లు, తలకు, అరవింద్‌రెడ్డికి కడుపుపై, వినయ్‌కి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యాభివృద్ధికి 'జోగినపల్లి' కృషి ఎనలేనిది

- త్రిదండి చిన్నజీయర్ స్వామి



భాస్కరరావు వర్ధంతిలో చిన్నజీయర్ స్వామి తదితరులు

మొయినాబాద్ రూరల్: విద్యాభివృద్ధికి జోగినపల్లి భాస్కర్‌రావు ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి అన్నారు. బుధవారం మొయినాబాద్ మండలం అమ్డాపూర్ చౌరస్తాలో జేబీ గ్రూప్ విద్యా సంస్థ ఫౌండర్, చైర్మన్ భాస్కరరావు 10వ వర్ధంతిని ఆయన సతీమణి, సంస్థ చైర్‌పర్సన్ వసుమతిదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిదండి.. జోగినపల్లి చిత్రపటానికి జ్యోతిప్రజ్వలన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలలు నెలకొల్పి, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో జోగినపల్లి కుటుంబ సభ్యులు డాక్టర్ దీపిక, డాక్టర్ రామోహన్‌రావు, కృష్ణారావు, వంశీధర్‌రావు, గాయత్రి, అపోలో వైద్యులు దామోదర్ శేశగిరి రావు, వ్యాపారవేత్త మహేశ్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, పండిత్ వెంకటచలం, రామోహ్మన్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ యాదయ్య, ఫార్మసి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.